రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# ఆకస్మిక వర్షాల భయంతో కంటిమీద కునుకు లేదు



అలియాబాద్ కొనుగోలు కేంద్రం వద్ద ఇబ్బందులను బిజెపి నాయకులకు వివరిస్తున్న రైతులు

★ధాన్యం లోడుతో రోజుల పడి నిరీక్షిస్తున్నాం ★ట్రాక్టర్‌లకు కిరాయిల భారం పెరుగుతోంది ★ధాన్యం కొనే పరిస్థితి కనిపించటం లేదు ★కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల ఆవేదన ★ప్రతిగింజ కొనడం అంటే ఇదేనా.. బిజెపి నేతల ఆగ్రహం

**శామీర్‌పేట, జూన్ 4, ప్రభాతవార్త :** అలియాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బిజెపి నాయకుల బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డిలకు అక్కడి రైతులు తమ గోడును వినిపించారు. గత వారం రోజుల నుంచి కొనుగోళ్లు జరగటం లేదని తెలిపారు. పంట దిగుబడిని ట్రాక్టర్లతో కేంద్రాలకు చేర్చినా.. పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వకు స్థలం లేదని, లారీల కొరత కారణంగా మిల్లులకు తరలించలేక పోతున్నారని వివరించారు. మరోవైపు ఆకస్మికంగా వర్షాలు పడుతుండటంతో తమకు కంటిమీద కునుకు ఉండటం లేదని వాపోయారు. దీనిపై బిజెపి నాయకులు ప్రతిస్పందిస్తూ .. కొనుగోలు విషయంపై ఇన్‌చార్జి, సంబంధిత అధికారులతో మాట్లాడామని అయినా వారి నిర్ల క్ష్యం వీడటంలేదని ఆరోపించారు. రైతులు లోడు ట్రాక్టర్లను ఎన్ని రోజుల పాటు ఉంచగలుగుతారని, వాటికి కిరాయి ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేయకపోవటం వల్లనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. వర్షాలు ముంచుకొస్తున్న నేపథ్యంలో రైతులు మానసిక ధైర్యాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. దీనికి సంబంధిత అధికారులే బాధ్యత వహించాలన్నారు. చివరి గింజవరకు కొనుగోలు చేస్తామన్న ప్రకటనలు కార్యరూపంలో కనిపించటంలేదని మండిపడ్డారు. నిర్లక్ష్యం కొనసాగితేబిజెపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు.

**అదనపు కలెక్టర్‌కు రైతు సంఘం వినతి పత్రం**

శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో ఆగిపోయిన ధాన్యం కొనుగోళ్లను పునరుద్ధరించాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ముఖ్య నాయకుల బృందం డిమాండ్ చేసింది. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు సంఘం జిల్లా ముఖ్య నాయకులు వెళ్లి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితోపాటు సివిల్‌సప్లయి డిఎం న ం గ ం ణ బా ం య క ం వినతిపత్రాన్ని అందజేశారు. శామీర్‌పేట, అలియాబాద్, జగ్గంగూడ, కేశవరం, మూడుచింతలపల్లి-లక్ష్మాపూర్, ఉద్దెమర్రి కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేక నిలిచిపోయినట్లు, దీనిలో అధికారుల ముందస్తు చర్యలు లేక నిర్లక్ష్యం వల్లనే రైతులు అమ్ముకోలేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

# పగలు కూలీ.. రాత్రి కిలాడీ

**వికారాబాద్, ప్రభాతవార్త :** బాల నేరస్తుడి నుంచి అంతర్రాష్ట్ర దొంగ వరకు చోర కళలో రాణించాడు. నిందితుడిపై ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో 61 కేసులు నమోదయ్యాయి. నేర ప్రవృత్తి ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 157 తులాల బంగారం, 256 తులాల వెండి, రూ.8,22,500 నగదును దొంగిలించినట్లు పోలీసు విచారణలో తేలింది. ఇలాంటి కరడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగను వికారాబాద్ జిల్లా సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. ఈ విషయమై ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్పీ తెలిపారు. చివరకు నేర స్థలంలో సేకరించిన సాంకేతిక సాక్ష్యాల ఆధారంగా ఈ చోరీకి పాల్పడిన ప్రధాన నిందితుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వికాస్ సింగ్ అలియాస్ తేజా సింగ్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. నిందితుడు ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారంలోని పోచమ్మ బస్తీ, గాంధీనగర్, సూరారం(సాయిబాబా నగర్) పరిసర ప్రాంతాలలో నివాసం ఉంటున్నాడు. వికాస్ సింగ్, పైకి కూలీ పనులు చేస్తున్నట్లు నటిస్తూ రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడేవాడని ఎస్పీ పేర్కొన్నారు. గతంలో దొంగతనం చేసిన నర్సాపూర్, మేడ్చల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని నేరాల్లో ఇతనే దొంగతనం పాల్పడినట్లు సాంకేతిక ఆధారాలు లభించాయని అన్నారు. దీంతో నిందితుడిపై గట్టి నిఘా పెట్టిన జిల్లా పోలీస్ అధికారులు, అర్ధరాత్రి సమయంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజాలు బయటపెట్టినట్లు ఎస్పీ తెలిపారు. వికాస్ సింగ్ 16 ఏళ్ల వయసులోనే నేర జీవితాన్ని ప్రారంభించాడని, ఇతనిపై గతంలో సంగారెడ్డి, బొల్లారం పరిసర ప్రాంతాలలో సుమారు 34 రాత్రి వేళల దొంగతనం కేసులు ఉన్నాయి. 2018లో నాలుగు, 2021లో తొమ్మిది, 2022లో 21 కేసుల్లో సంగారెడ్డి పోలీసులు ఇతడిని అరెస్ట్ చేయగా, జైలు శిక్ష సైతం అనుభవించి 2024 జూన్ 26న జైలు నుండి విడుదలైనట్లు ఎస్పీ తెలిపారు.

జైలు జీవితం అనుభవించిన వికాస్‌సింగ్ ప్రవర్తనలో మార్పు రాకపోగా, తిరిగి వికారాబాద్ జిల్లా, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పరిధుల్లో 27 రాత్రి పూట దొంగతనాలకు పాల్పడి 157 తులాల బంగారం, 256 తులాల వెండి, రూ. 8,22,500 నగదును దొంగిలించినట్లు వికాస్ సింగ్ ఒప్పుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. దొంగతనం ద్వారా వచ్చిన డబ్బుతో జల్సాలు చేయడంతో పాటు, అతని స్వగ్రామంలో ప్రజలకు హెల్పింగ్ హ్యాండ్ అనే ఎన్‌జిఓ పేరుతో డబ్బులు, స్కూల్ బ్యాగులు, నోట్ బుక్‌లు పంచుతూ, సేవాభావాన్ని ప్రదర్శించి మంచివాడు అనిపించుకునేందుకు ప్రయత్నించాడు. స్నేహితులను విహార యాత్రలకు తీసుకెళ్తూ స్థానికంగా అతనిపై ఎవరికీ అను మానం రాకుండా ఒక రకమైన సామాజిక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకున్నాడని ఎస్పీ తెలిపారు. దొంగిలించిన ఆభరణాలను అతని స్వగ్రామ పరిసర ప్రాంతాలు అయిన కుర్వర్, గంజేరి క్రింద ఉన్న బంగారం షాప్ యజమానులకు అమ్మేవాడని విచారణలో తేలిందని ఎస్పీ పేర్కొన్నారు. బంగారు దుకాణ యజమానులైన శ్యామ్ మోహన్, సూరజ్ మోహన్, అశోక్ సోని, వికాస్ అగ్రహారిలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

బంగారు దుకాణ యజమానులందరూ తలా రూ. 10 వేలు చొప్పున మొత్తం 40 వేలు రూపాయలు ఇచ్చి దొంగతనాలకు ప్రోత్సహించడంతో, అక్రమంగా తుపాకి సైతం కొనుగోలు చేశాడని ఎస్పీ వివరించారు. నిందితునిపై పాత 34 కేసులు, ప్రస్తుతం 27 కేసులు కలిపి మొత్తం 61 కేసులు నమోదయ్యాయని ఎస్పి వెల్లడించారు.

27 కేసులలో వికాస్‌సింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి తులంన్నర బంగారం ఆభరణాలు, ఒక తుపాకీ (5ఎంఎం పిస్తోల్) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ లను ఎస్పీ స్నేహా మెహ్రా అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా

16వ ఏట నుంచే చోరకళ..

కేజీల కొద్దీ బంగారం, వెండి హాంఫట్

జైలుకెళ్లినా మారని జల్సాల రాజా

దొంగ సొమ్ముతో స్కూల్ బ్యాగులు, నోట్ బుక్‌లు పంపిణీ

సమాజంలో మంచివాడిగా నటించేందుకు వ్యూహం

యూపీలో నలుగురు నగల వ్యాపారుల ప్రోత్సాహం

దొంగిలించిన ఆభరణాలన్నీ షాప్ యజమానులకు అమ్మకం

61 కేసుల అంతర్రాష్ట్ర దొంగ ఆటకట్టించిన వికారాబాద్ పోలీసులు



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న రివాల్వర్, బంగారు ఆభరణాలు

వికారాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికంఠనగర్ కాలనీలో గత నెల 1వ తేదీ రాత్రి సమయంలో ఓ ఇంట్లోకి చొరబడి ఒకటిన్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.2.10 లక్షల నగదును గుర్తు తెలియని దొంగలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి వికారాబాద్ డీఎస్పీ అంజయ్య ఆధ్వర్యంలో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ ఇన్స్పెక్టర్ రఘుకుమార్‌ల నేతృత్వంలోని

# ప్రాణాలతో చెలగాటం

ప్రమాదపు అంచున పెద్దవాగు బ్రిడ్జి

రక్షణదిమ్మెలు లేక నిత్యం భయాందోళనతో ప్రయాణికులు

వెంటనే తగు చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**మోమిన్‌పేట్, జూన్ 4. ప్రభాతవార్త:** మోమిన్‌పేట మండల పరిధిలోని పెద్దవాగుపై ఉన్న బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ దిమ్మెలు (పారాపెట్ దిమ్మెలు) లేకపోవడంతో నిత్యం ప్రయాణికుల ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో ప్రతీరోజూ వందలాది మంది విద్యార్థులు, పాఠశాలల బస్సులు, రైతులు, ఉద్యోగులు, ప్రజలు, ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. అయితే బ్రిడ్జి ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. రాత్రి పూట సమయంలో వెలుతురు సరిగ్గా కనిపించకపోవడం, హెచ్చరిక, సూచిక బోర్డులు లేకపోవడం వల్ల కొత్తగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జికి ఇరువైపులా బలమైన రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేసి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని పలువురు ప్రయాణికులు గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందస్తుగా భద్రతా చర్యలు చేపట్టడం ఎంతో అవసరమని పేర్కొంటున్నారు.



శిథిలావస్థలో ఉన్న మోమిన్‌పేట్ పెద్దవాగు బ్రిడ్జి

అంచులు బలహీనంగా ఉండటం, రక్షణ గోడలు లేకపోవడం వల్ల చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకంటే విలువైనది ఏదీ లేదని తెలుసుకొని సంబందిత అధికారులు వెంటనే స్పందించి పెద్దవాగు బ్రిడ్జిని సురక్షితంగా ఉండేటట్లు మార్చాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళనచేస్తున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) మృతుడు రాజు (ఫైల్)

ధారూర్ పోలీస్ స్టేషన్ ఎదుట మృతదేహంతో రాస్తారోకో

స్నేహితురాలి బంధువుల వేధింపులే కారణమని ఆరోపణ

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

వికారాబాద్ డీఎస్పీ హామీతో ఆందోళన విరమణ

**ధారూర్, జూన్ 4, ప్రభాతవార్త:** ధారూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఒక యువకుడి ఆత్మహత్యకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు భారీ నిరసనకు దిగారు. వివరాల్లోకి వెళితే, మండల పరిధిలోని స్టేషన్ ధారూర్ గ్రామానికి చెందిన రాము కుమారుడైన, రాజు(24) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే తన కొడుకు చావుకు కొందరు వ్యక్తులు పెట్టిన మానసిక, శారీరక టార్చరే కారణమని, రాజు జేబులో దొరికిన సూసైడ్ నోట్ ఆధారంగా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుం బీకులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో గ్రామస్తులు, బాధితుడి కుటుంబ సభ్యులు కలిసి మృతదేహాన్ని ధారూర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. దీనితో ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది.

మృతుడి తండ్రి రాము ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న రాజు, నల్గొండ జిల్లాకు చెందిన పద్దుల మోనిక (24) అనే యువతితో స్నేహపూర్వకంగా ఉండేవాడు. అయితే, గత ఏప్రిల్ 27న మోనిక తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి రాజుతో గొడవపడి టార్చర్ పెట్టింది. ఈ విషయంలో వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఈ వివాదం కారణంగా మనస్తాపానికి గురైన రాజు చెల్లెలు తులసి బాయి ఏప్రిల్ 29న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చెల్లెలు చనిపోయిన తర్వాత కూడా మోనిక, ఆమె అన్న మధు శేఖర్ అనే వ్యక్తులు రాజును వేధించడం ఆపలేదని, అంతేకాకుండా మహేందర్ రహీం అనే వ్యక్తులు రాజును వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి క్వార్టర్స్ వద్దకు పిలిపించి దాడి చేశారని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే గురువారం రాజు తన తండ్రికి ఫోన్ చేసి ఏడుస్తూ..జాగ్రత్తగా ఉండమని చెప్పి పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

రాస్తారోకో విషయం తెలుసుకున్న వికారాబాద్ డీఎస్పీ అంజయ్య వెంటనే ధారూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. నిరసనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మృతుడి కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని, సూసైడ్ నోట్ ఫిర్యాదులో ఉన్న బాధ్యులందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు. ఉన్నతాధికారి హామీతో శాంతించిన కుటుంబ సభ్యులు నిరసనను విరమించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ధారూర్ ఎస్ఐ సున్నం రాఘవేందర్ తెలిపారు. సూసైడ్ నోట్‌లో పేర్కొన్న వివరాలు, పేర్ల ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేసి, దోషులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్ఐ స్పష్టం చేశారు.

# ఉరుకులు..పరుగులు

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై కలెక్టర్ అలర్ట్

క్షేత్రస్థాయి పర్యటనలతో అధికారులకు ముచ్చెమటలు



కొడంగల్‌లో రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్ దీపక్ తివారీ

**కొడంగల్, జూన్ 4 ప్రభాతవార్త :** కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల ఆందోళనల నేపథ్యంలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. కొడంగల్ ప్రాంతంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం, హస్నాబాద్, వెంకటేశ్వర రైస్ మిల్లర్ల కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైస్ మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాల సాధించటానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం దించుకోండంలో జాప్యం లేకుండా ఎక్కువ సంఖ్యలో హమాలీలను సమకూర్చుకోవాలని సూచించారు. లారీ ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్లు ధాన్యాన్ని సకాలంలో చేర్చేందుకు వాలుగా అదనంగా లారీలను సమకూర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు గొనె సంచులు, తూనీక, తేమ యంత్రాలు, తాడిపత్రులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటచారి, పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్

# రూ.10కోట్లతో పాతకొడంగల్ అభివృద్ధి

**కొడంగల్, జూన్ 4 ప్రభాతవార్త :** మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు పాతకొడంగల్ గ్రామంలో రూ.10కోట్లతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ ఛైర్మన్ నందారం ప్రశాంత్ తెలిపారు. గురువారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బలరాంనయక్ మాట్లాడుతూ త్వరలోనే వృద్ధులు, వితంతులు, వికలాంగులకు పింఛన్‌లు అందిస్తామన్నారు. సీఐ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఏవైనా సమస్యలు త్పున్నమైతే సమిష్టిగా చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. గొడవలు పెద్దగా చేసుకొని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగవద్దని కోరారు. రైతులు ఫోన్‌లో పొందుపర్చిన యాప్‌తో ఎరువులు, విత్తనాలు పొందవచ్చని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు శంకర్‌రాథోడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపలన వైస్‌చైర్మన్ శంకర్‌నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వివిధ వార్డుల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభ నిర్వహించారు.

# పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన అవసరం

మేడ్చల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్




వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 4, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ అవగాహన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ సందేశాలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని, కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని స్థానిక సంస్థల కార్యాలయాల్లో నోటీస్ బోర్డులపై పోస్టర్‌ను ప్రదర్శించాలని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు, ప్రత్యామ్నాయాలు, అలాగే ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యత భావం పెంపొందించి స్వచ్ఛమైన, హరితమైన,స్థిరమైన పర్యావరణ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం మేడ్చల్‌కు చెందిన పర్యావరణ ఇంజనీర్ బి.రాజేందర్, అసిస్టెంట్ ఎన్విరాల్‌మెంటల్ సైంటిస్ట్ జి.లింగయ్య పాల్గొన్నారు.

# నింగికి మబ్బులు ముసిరిన వేళ...నేల మురిసిందిలా..



ఉదయం నుంచి ఉక్కపోత, ఎండ మంటలతో అల్లాడిపోయిన నగర వాసులకు... సాయంత్రం వేళ వీచిన చల్లని గాలి, ఆ వెనుకే వచ్చిన చిరుజల్లులు కాస్తంత సేదతీర్చాయి. రుతుపవనాల రాక ఆలస్యమవ్వడంతో మరికొన్ని రోజులు ఎండ తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే గురువారం సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్మేశాయి. రోడ్ల మీద ఉన్న వాహనదారులు చిరుజల్లులతో ఉపశమనం పొందారు. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోయి సిటీ చల్లబడింది.



ఎల్లంపేట గ్రామంలో నిర్వహించిన వార్డు సభ

## ఎల్లంపేటలో వార్డు సభ

**మేడ్చల్, జూన్ 4, ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎల్లంపేట మున్సిపల్ కేంద్రమైన ఎల్లంపేట గ్రామంలో గురువారం వార్డు సభ నిర్వహించారు. ఈ సభలో ప్రజా ప్రయోజనార్థం పలు అంశాలపై చర్చించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు పనులు చేపట్టడం, దోమల నివారణకు, నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలను పూర్తిగా శుభ్రం చేయాలని, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించాలని వివరించారు. నూతన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల ప్రకారం తడి, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణ నియమాలను పాటించాలన్నారు. భూగర్భ జలాల పెంపుకై ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టడం. వేసవి, వర్షాకాల సమయాల్లో ప్రజలందరికీ స్వచ్ఛమైన త్రాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని, అంతర్గత రహదారుల మరమ్మతులు, రాత్రి వేళల్లో ప్రజల రక్షణ కోసం వార్డులోని అన్ని వీధి దీపాలు వెలిగేలా తగిన చర్యలు తీసుకోవాలని విషయాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ వార్డుల అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసికట్టుగా పనిచేసి మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందుండేలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రజిత, వార్డు కౌన్సిలర్లు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

**ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు**

**మేడ్చల్, జూన్ 4, ప్రభాతవార్త :**

ఎల్లంపేట మున్సిపాలిటీ కమిషనర్ కృష్ణారెడ్డిని మేడ్చల్ మాజీ వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు ఎల్లంపేట మున్సిపాలిటీ వివిధ వార్డులలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నర్సింహ, నాయకులు జగన్ రెడ్డి, సుదర్శన్, సంజీవ్ గౌడ్, దేవేందర్ రెడ్డి, ఇటుక రాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కేంద్రంలో పాఠశాల సంసిద్ధత మేళా

**మేడ్చల్, జూన్ 4, ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలోని 1 వ అంగన్ వాడీ కేంద్రంలో ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల సిద్ధత (స్కూల్ రెడినెస్) మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీడీపీఓ శారద మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్ వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసామని, ఆటల పాటల ద్వారా విద్యను బోధిస్తున్నామని తెలిపారు, అదే విధంగా శారీరక, భాషా, బుద్ధి, పూర్వగణిత వికాసం నేర్పిస్తామని, ఇవి పిల్లల అభివృద్ధికి దోహదపడతాయన్నారు. గర్భవతులు, బాలింతలు అంగన్ వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారం, బాలామృతం తీసుకోవాలని తలులను సూచించారు, ఈ కార్యక్రమంలో ప్రథమ్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ లలిత, అంగన్‌వాడి సూపర్‌వైజర్ హైమావతి, టీచర్లు శోభారాణి, ఉమారాణి, ఇందిర, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భవనంపై నుండి పడి కార్మికుడు మృతి

**మేడ్చల్, జూన్ 4, ప్రభాతవార్త :**

భవణంపై నుండి పడి సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన దేవర రవి నగరంలోని మూసాపేటలో ఉంటూ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కాగా అతను మేడ్చల్ పట్టణంలోని నవోదయ వెంచర్లో నిర్మాణంలో ఉన్న భవణంలో సెంట్రింగ్ పనులు చేయడానికి వచ్చాడు. గురువారం ఉదయం భవనం 3వ అంతస్తుపై సెంట్రింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు జారి కింద పడి అక్కడికక్కడే కార్మికుడు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులుఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**షాబాద్, జూన్ 4, ప్రభాతవార్త :** స్వచ్ఛ గావ్, సురక్షిత్ జలవాయు 2026 ఏక్ పేడ్ మా కే నామ్..కార్యక్రమంలో భాగంగా గురువారం సంకేపల్లిగూడ క్రీడా ప్రాంగణం ఆవరణలో సర్పంచ్ కుమ్మరి లావణ్యతో పాటు మాజీ ఎంపీటీసీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, గ్రామస్తులు మొక్కలు నాటారు. వేడిమి తగ్గించడానికి మొక్కలు నాటడమే పరిష్కారమని చెప్పారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, వార్డు సభ్యులు బి. సత్తయ్య, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఫయాజ్, గ్రామ నాయకులు సి. నర్సింహులు, ఆంజనేయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత కొరకు ప్రత్యేక గ్రామసభ

**మోమిన్‌పేట్, జూన్ 4, ప్రభాతవార్త:** ఎక్కడైతే మహిళలు గౌరవింపబడుతారో అక్కడ సిరి సంపదలు, అష్టైశ్వర్యాలు, అదృష్టం వరించి ఉంటాయని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యధర్శి, కోల్కుంద సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని కోల్కుంద గ్రామంలో "మహిళల భద్రత" కార్యక్రమంలో భాగంగా గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా సర్పంచ్ కీర్తి రామకృష్ణ మాట్లాడుతు ఏ గ్రామంలోనైనా స్త్రీలను గౌరవిస్తారో అక్కడ సరిసంపదలు, అష్టైశ్వర్యాలు మెండుగా ఉంటాయని అన్నారు. అదే విధంగా మా గ్రామంలో ప్రతిఒక్కరు మహిళలపట్ల గౌరవం, ఆప్యాయతా, మర్యాద కలిగి ఉంటారని, అందుకు మహిళలు మహరాణులని అంటారని, చట్ట సభల్లో కూడా మహిళలకు ప్రత్యేకమై సముచిత స్థానం కలిగి ఉన్నారని ఆమె తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చిన మా వంతు సహాయ సహకారాలు ఎల్లపుడు ఉంటాయని, గ్రామంలో ఎలాంటి శుభాశుభ కార్యక్రమాలకు ఆర్థిక సహాయం చేయడం చాలా కాలం నుండి ఆనవాయితిగా చేయడం జరుతున్న సంగతి తెలిసిందే, ఇంకా ఎన్ని కాలాలైనా మాకు ఆ భగవంతుని కరునా కటాక్షములున్నన్ని రోజులు గ్రామ సంక్షేమమే లక్షంగా పని చెయడం జరుగుతుందని సర్పంచ్ కీర్తి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డి, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణా రెడ్డి, వార్డు సభ్యులు గందె శంకర్, మోముల బిచ్చప్ప, టప్ప ఖాశీం, రాజమణి, నాగమణి, వినోద, స్వరూప, గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు, మహిళలు, పోలీసు సిబ్బంది, పంచాయతి కార్యధర్శి మహమ్మద్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా వేద విద్య తరగతులు

**హైదరాబాద్, జూన్ 4 ప్రభాతవార్త**

శ్రీవైష్ణవిదేవి వేద విద్యా పీఠం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేద విద్యను ఉచితంగా అభ్యసింపబడునని జాతీయ జ్యోతిష్య రత్న పురస్కార గ్రహిత, జ్ఞాన ప్రబోధానంద సరస్వతి దైవజ్ఞాలు, బ్రహ్మశ్రీ సురోజు ఉపేంద్ర ఆచార్యులు అన్నారు. గురువారం కాచిగూడలో విలేకరులతో ఉపేంద్ర దీక్షితులు మాట్లాడుతూ 12 సంవత్సరాల నుండి 25 సంవత్సల విశ్వబ్రహ్మణ యువతి, యువకులకు ఈ వేద విద్యను ఉచితంగా నేర్పించబ డునని వెల్లడించారు. గత 25 యేండ్లుగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పురోహితం, జ్యోతిష్య సేవాలను అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల యువత వివరాలకు 73962 35319, 8901320353లో సంప్రదించాలని కోరారు.

# దాయరకుంట చెరువును ప్రజలకు ఉపయోగపడేలా చేయండి


నాగారం దాయరకుంట చెరువును అభివృద్ధి చేయాలని డిప్యూటీ కమీషనర్ వాణిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థిని సాయి స్నేహ పటేల్

**కీసర, జూన్4, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ దాయరకుంట చెరువును సుందరీకరణ చేసి ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని గురువారం సాయి దిశా హై స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని గంద్ర సాయి స్నేహ పటేల్ డిప్యూటీ కమీషనర్ వాణిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని మాట్లాడుతూ నాగారం నడిబొడ్డున వందలాది కుటుంబాలు నివాసాల మధ్య ఉన్న దాయరకుంట చెరువు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై తన ఉనికిని కోల్పోతున్న పరిస్థితిని చూసి విద్యార్థినిగా చాలా బాధపడుతున్నానని అన్నారు. చెరువును సుందరీకరణ చేసి, పచ్చదనంతో నింపి, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి సాయంత్రం వేళల్లో మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఆహ్లాదకరంగా గడిపే ప్రదేశంగా అభివృద్ధి చేయాలని కోరారు. అంతేకాకుండా తెలంగాణ ఆత్మగా భావించే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించే వేదికగా కూడా చెరువును తీర్చిదిద్దవచ్చన్నారు. పాఠశాలల్లో మాకు చెరువులను కాపాడాలని, పర్యావరణాన్ని రక్షించాలని, సంస్కృతిని నిలబెట్టాలని పాఠాలు చెబుతున్నారు, కానీ ఈ ప్రాంతంలో ఉన్న దాయరకుంట పరిస్థితిని చూస్తే ఆ పాఠాలు పుస్తకాలకే పరిమితమయ్యాయా అనే సందేహం కలుగుతుందని అన్నారు. చెరువును అందంగా తీర్చిదిద్దడానికి అధికారులు ముందుకు రాకపోతే, ప్రజల కోసం ఎన్నికైన నాయకులు స్పందించకపోతే మేము విద్యార్థులం ఎవరిని ఆశ్రయించాలని ప్రశ్నించారు. బతుకమ్మ అంటే తెలంగాణ సంస్కృతి అంటారని, చెరువులు తెలంగాణ జీవనాడి అంటారన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అంటారన్నారు. అయితే దాయరకుంట చెరువు ఎందుకు ఇలా నిర్లక్ష్యానికి గురువుతోందని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యం పిల్లల భవిష్యత్తు, తెలంగాణ సంస్కృతి కంటే ముఖ్యమైన పనులు ఇంకేమైనా ఉన్నాయా అన్నారు. దాయరకుంట చెరువును సుందరీకరణ చేసి ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేసి, బతుకమ్మ సంబరాలు జరుపుకునే తెలంగాణకే గర్వకారణంగా మార్చాలని వినమ్రంగా కోరుతున్నానని అన్నారు.

# సాగు కష్టాలకు 'ఏఐ' చెక్..రైతుల కోసం 'భూమి' యాప్!

**- సిఎస్ఈ విద్యార్థుల వినూత్న ఆవిష్కరణ..**
**-నందారంలో రైతులకు క్షేత్రస్థాయి అవగాహన**

**దౌల్తాబాద్, జూన్4, ప్రభాతవార్త:** రైతులు సాగులో సరైన నిర్ణయాలు తీసుకుంటూ, ఆధునిక సాంకేతికతతో అధిక లాభాలు గడించేలా సిఎస్ఈ 3వ సంవత్సరం విద్యార్థులు సాయిరిత్విక్ రెడ్డి, నవ్యరెడ్డి, శ్రితరెడ్డి, జాన్సన్‌ఓదూరి కలిసి "భూమి-ది మోడరన్ ఫార్మింగ్" అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) ఆధారిత డిజిటల్ వేదికను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు వివ రాలను వారు నందారం గ్రామంలోని రైతులు, గ్రామ పెద్దలకు క్షేత్ర స్థాయిలో వివరించి, అవగాహన కల్పించారు. ఈ భూమి ప్లాట్‌ఫారమ్ ద్వారా రైతులకు నేల నాణ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ డిమాండ్‌ను బట్టి లాభదాయకమైన పంటల ఎంపికపై ముందస్తు సూచనలు అందుతాయని, అలాగే ఎరువులు, పురుగుమందుల వాడకం, సకాలంలో పంట హెచ్చరికలతో పాటు కోత అనంతరం దళారీల ప్రమేయం లేకుండా కొనుగోలుదారులతో నేరుగా అనుసంధానం చేసి మెరుగైన ధరలు కల్పించడమే ఈ యాప్ ముఖ్య ఉద్దేశమని విద్యార్థులు తెలిపారు. "రైతు నిర్ణయాలకు డిజిటల్ తోడుగా, మెరుగైన దిగుబడికి ఆధునిక పరిష్కారం"గా నిలవడమే తమ లక్ష్యమని పేర్కొన్న విద్యార్థుల ప్రతిభను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్నేహరాజ్ గోపాల్, రాజశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న సిఎస్ఈ విద్యార్థులు

# కొడంగల్‌లో వైన్ షాపులో చోరీ

**-మద్యం, నగదు, సీసీటీవీ హార్డ్‌డిస్కుల అపహరణ**
**-క్లూస్ టీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**కొడంగల్, జూన్ 4ప్రభాతవార్త**

కొడంగల్ పట్టణంలో అర్ధరాత్రి వైన్ షాపులో చోరీ సంఘటన కలకలం రేపింది. పట్టణంలోని శ్రీనాగ ఎల్లమ్మ మద్యం దుకాణంలో గుర్తు తెలియని దండగులు చోరికి పాల్పడి నగదు, మద్యం సీసాలు, సీసీటీవీ కెమెరాల హార్డ్‌డిస్కులను అపహరించారు. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే..కొడంగల్ పట్టణంలోని శ్రీనాగ ఎల్లమ్మ వైన్ షాపును యజమానులు రోజుమారిగానే బుధవారం రాత్రి మూసివేసి వెళ్ళిపోయారు. అనంతరం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు దుకాణం వెనుక భాగంలో గోతిని తవ్వి రేకులను కట్ చేసి లోపలికి ప్రవేశించారు. అనంతరం షాపులో ఉన్న చిల్లర నగదుతో పాటు కొంత మద్యం సాసాలను అపహరించారు. గురువారం ఉదయం పక్కనే ఉన్న దుకాణాల యజమానులు షాప్ పరిస్థితిని గమనించి వెంటనే వైన్ షాపు యజయానికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న షాపు యజమాని దుకాణంలో జరిగిన చోరిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం కేసు నమోదు చేసుకున్న పోలీసులు క్లూస్ టీంను రంగంలోకి దింపారు. క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకొని వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు.


ఫోటోవార్త:కెడిఎల్ 3పిహెచ్: వైన్ షాపులో దర్యాప్తు చేస్తున్న క్లూస్ టీం

# డిఇఒకి ఘనంగా వీడ్కోలు పలికిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు


మేడ్చల్ జిల్లా డిఇఓగా విధులు నిర్వహించి మహబూబ్‌నగర్ జిల్లా డిఇఓగా బదిలీ అయిన ఐ.విజయకుమారికి వీడ్కోలు పలికి ఘనంగా సన్మానించిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 4, ప్రభాతవార్త:**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిఇఓగా పనిచేసి బదిలీ అయిన ఐ.విజయకుమారిని ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఇజెఎసి) మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఆధ్వర్యంలో బదిలీ అయిన డిఇఓ విజయకుమారికి ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ బి.రవిప్రకాశ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా డిఇఓగా బదిలీపై వెళ్లిన ఆ డిఇఓ విజయకుమారికి సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల జిల్లా జెఎసి చైర్మన్ బి.రవిప్రకాశ్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా అధికారిగా విజయకుమారి విశిష్ట సేవలు అందించి మంచి గుర్తింపును పొందారని అన్నారు. కరోనా సమయంలో విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులను సమర్థవంతంగ నిర్వహించి, వినూత్న విద్యా కార్యక్రమాలను అమలు చేసినందుకు కేంద్ర ప్రభుత్వం ఉత్తమ పురస్కారాన్ని డిఇఓకు అందించటం జరిగిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమన్వయం చేసుకుంటూ ఉపాధ్యాయుల, ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారని, విద్యార్థుల నమోదును కూడ జిల్లాలో పెంచారని అన్నారు.

డిఇఓగా పనిచేసి బదిలీ అయిన విజయకుమారి పేర్కొంటూ తనకు సహకరించిన అందరికి దన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బి.రవిప్రకాశ్‌తో పాటు పిఆర్‌టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్‌గౌడ్, టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయసింహరెడ్డి, ఎస్టీయు జిల్లా కార్యదర్శి విఠల్, టిఎస్‌జిహెచ్‌ఎంఎ అధ్యక్షులు రాంరెడ్డి, కార్యదర్శి మురళి, పిఆర్‌టియుటిఎస్ కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, యుటిఎఫ్ కార్యదర్శి మదన్, టిఎన్‌జిఒస్ కార్యదర్శి భరత్‌కుమార్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు కార్తీక్, టిపియుఎస్ నవీన్, టిఆర్‌టిఎఫ్ దానయ్య, టిపిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డి, ఆర్‌యుపిపి నాయకులు రోహిత్, గురునాధం, డిటిఎఫ్ జనార్ధన్, మరి కొందరు ఉపాధ్యాయులు తిరుమలేశ్, కుమార్, సత్తిరెడ్డి, మురళి, పలువురు ఉపాధ్యాయ సంఘాల వారు, ఉద్యోగ సంఘాల వారు పాల్గొని ఆమెను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు.

## నిమ్స్ డైరెక్టర్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలి : దళిత, బిసి సంఘాలు

**సైఫాబాద్, జూన్ 4 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలకు గుండెకాయ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర పేద ప్రజలకు కార్పోరేట్ ఆసుపత్రిగా పేరుగాంచిన నిమ్స్ ఆసుపత్రిలో అవినీ తి పరుడైన డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పను తక్షణమే భర్తరఫ్ చేయాలని పలు దళిత, బిసి సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సింఎ రేవంత్‌రెడ్డికి ఆ సంఘాల నేతలు ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. గతంలో సిఎం, డిసి ఎం, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తదితరులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. గురువారం ఎన్ ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మన్ నల్ల సూర్యప్రకాష్, సామాజిక తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు పోకల కిరణ్‌కుమార్, భారతీయ తెలంగాణ రాష్ట్ర సమితి ఛైర్మన్ గొల్లపల్లి దయానందరావు, భారతీయ మహిళా విమోచన సమితి అధ్యక్షరాలు కోయి లక్ష్మీ పార్వతి తదితరులు మాట్లాడుతూ పలు అంశాలలో బీరప్ప అవినీతికి పాల్పడుతున్నారని విజిలెన్స్ అధికారుల విచారణ జరుగుతున్న నేపథ్యంలో తక్షణమే ఆయన్ని బర్తరఫ్ చేయా లని, అసలు ఈ నెల 6వ తేదీతో ఆయన పదవి కాలం ముగు స్తున్నదని, తక్షణమే సర్చ్ కమిటిని వేసి దళిత వర్గానికి చెందిన మంచి వ్యక్తిని డైరెక్టర్‌గా నియమించాలని వారు కోరారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత రెండు సార్లు బిసిలు నిమ్స్‌కు డైరెక్టర్‌గా ఉన్నారని, ఒక్కరూ కూడా దళితులు లేరని, ఈ సారి దళితులకు అవకాశం కల్పించాలని కోరారు. బీరప్పను తొలగించకపోతే అన్ని దళిత, బిసి సంఘాలు ఉద్యమిస్తాయని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మహమ్మద్ ఇక్బాల్, సాయికుమార్, పాశం రాజేందర్‌యాదవ్, జంగన్నగౌడ్, మారోజు సునీల్ తదితరులు పాల్గొన్నారు.



సిఎంకు బహిరంగ లేఖను విడుదల చేస్తున్న దళిత, బిసి సంఘాల నాయకులు


జలమండలి ఈడీ స్వామ్రాట్ అశోక్, డైరెక్టర్ ఎన్.ప్రభులను కలిసి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

## అరుంధతినగర్‌లో ప్యాచ్‌వర్క్ పనులను వెంటనే పూర్తి చేయాలి

**చిక్కడపల్లి జూన్ 4 ,ప్రభాతవార్త :** గాంధీనగర్ డివిజన్ పరిధిలోని అరుంధతినగర్ బస్తీలో పెండింగ్‌లో ఉన్న ప్యాచ్ వర్క్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్థానిక మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ కోరారు. గురువా రం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వామ్రాట్ అశోక్, డైరెక్టర్ ఎన్.ప్రభులను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పావని వినయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సహకారంతో రూ.55 లక్షల నిధులతో అరుంధతినగర్ బస్తీలో నూతన సీవరేజ్ పైప్‌లైన్ పనులను గతంలోనే పూర్తి చేయడం జరిగిం దన్నారు. అయితే పైప్‌లైన్ పనులు పూర్తయినప్పటికీ, అక్కడ చేయాల్సిన ప్యాచ్‌వర్క్ (రహదారి మరమ్మతులు) పనులను అలాగే వదిలేశారని జలమండలి అధికారుల దృష్టికి తీసుకె ళ్లారు. రహదారి సరిగ్గా లేకపోవడం వల్ల బస్తీలోని వృద్ధులు, చిన్నారులు నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆమె వివరించారు. మాజీ కార్పొరేటర్ వినతిపై జలమండలి ఉన్నతాధికారులు సానుకూ లంగా స్పందించారు. వారం రోజుల్లోనే అరుంధతినగర్ బస్తీ లో ప్యాచ్‌వర్క్ పనులను ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చే స్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రా బాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బీజేపీ నాయకులు ఎం.ఉమేష్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## మంజూరైన రోడ్డుపనులను చేపట్టకుండా నిర్లక్ష్యం

**-భూసేకరణ ప్రక్రియపై అధికారుల అలసత్వం**

**ఘట్‌కేసర్, జూన్ 4, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో జరుగుతున్న రోడ్డువెడల్పు పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేయాలని మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటి కమిషనర్ వాణిరెడ్డికి తెలియజేశారు. ఘట్‌కేసర్ డివిజన్ యంనంపేట్ చౌరస్తా నుంచి మాధవరెడ్డి వంతెన వరకు హెచ్‌ఆర్‌డిసిఎల్ అధికారులు వంద అడుగుల వెడల్పుతో రోడ్డును అభివృద్ధి చేస్తుండగా మున్సిపల్ నుంచి డ్రైనేజీ మ్యాన్‌హోల్స్, పైపులైను మరమ్మత్తులు కూడా చేయకపోవడంతో హెచ్‌ఆర్‌డిసిఎల్ నుంచి పనులు చేసి సిసి వేయడానికి సమయం పడుతుండంతో వాహనాల రాకపోకలను మళ్లించారని తెలిపారు. రోడ్డు వెడల్పుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను చేపట్టడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని బాధితులకు నోటీసులు కూడా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. గత 3 నెలల క్రితం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, నారాయణగార్డెన్ నుంచి ఎదఉలాబాద్ రోడ్డు కనకదుర్గ వైన్స్ వరకు రోడ్డు మంజూరు కాగా టెండర్ అయినప్పటికి పనులను ప్రారంభించకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, డివిజన్ ప్రజల నుంచి ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారే గాని అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని యాదగిరియాదవ్ విమర్శించారు. ఈకార్యక్రమంలో జెఏసి కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, నాయకులు పొట్లచెరువు శ్రీరాములు, నజీర్, అహ్మద్, మానుక కుమార్, సార శ్రీనివాస్‌గౌడ్, కెఫా, శివరాత్రి సురేశ్, తన్నీరు హరీష్, సుబ్బారావు, శిశశంకర్, సురేశ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ధ్యేయం

**కేశంపేట ,జూన్ 4, ప్రభాతవార్త :**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని బొదునంపల్లి, బైర్ఖాన్ పల్లి, దత్తాయిపల్లి,దేవుని గుడి తండా , గ్రామ పంచాయతీలలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులతో కలిసి గ్రామసభలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ సభల్లో ఘన వ్యర్థాల నిర్వహణ పాటించాల్సిన పద్ధతులను సంబంధించి వివరించారు 2026 వర్షాకాల సన్నత మంచినీటి నిర్వహణ జల సంరక్షణ హరితవనం హరితహారం ప్లాంటేషన్ రైతు రిజిస్ట్రేషన్ మరియు ఎస్ ఐ ఆర్ గురించి ఎజెండాగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ లిస్టు మ్యాపింగ్ చేసుకుని వారికి లిస్ట్ తెచ్చి వారిని వెంటనే మ్యాపింగ్ చేసుకునే విధంగా చేయాలని అధికారులకు సూచించారు వారితోపాటు వ్యవసాయ శాఖకు సంబంధించిన అధికారులు రైతు రిజిస్ట్రేషన్లు వెంటనే పూర్తి చేయాలని వాటి ద్వారా యూరియా కొనుగోలు మొదలైన అన్ని రకాల వ్యవసాయాలకు పనిచేస్తుందని ఆయన తెలిపారు. వాటికి సంబంధించిన ఆధార్ కార్డులను ప్రతి రైతు మొబైల్ నెంబర్ కు లింక్ చేయాలని సూచించారు. అల్వాల రైతు వేదికలో నిర్వహించిన గ్రామసభకు ప్రత్యేక అధికారులుగా సిఐ నరహరి తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచులు ఉపసర్పంచులు వార్డు సభ్యులు మరియు ప్రత్యేక అధికారులు ప్రజలు గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పోలీసు కానిస్టేబుల్ బైకు చోరి

**జూబ్లీహిల్స్, జూన్ 4, ప్రభాతవార్తః**

పోలీసు కానిస్టేబుల్ బైకు చోరికి గురైన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. సిఎస్‌డబ్ల్యు విభాగంలో పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేసే మాదారి సుదర్శన్ ఎర్రమంజిల్ కాలనీలోని రామకృష్ణనగర్‌లో నివసిస్తుంటారు. గత నెల 31న రాత్రి 11.30 గంటల ప్రాంతంలో తన బజాజ్ పల్సర్ బైకు(టీఎస్09ఎఫ్ఎన్9976)ను ఇంటి ముందు నిలిపాడు. మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు చూడగా బైకు నిలిపిన ప్రాంతంలో కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లో వెదికాడు. ఫలితం లేకపోవడంతో బుధవారం పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సుఢీ కొట్టడంతో బిటెక్ విద్యార్థి మృతి

**కంటోన్మెంట్, జూన్ 4 ప్రభాతవార్త:** బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో బిటెక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన మారేడ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సోముల వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం సికింద్రాబాద్ వైఎం.సీ.ఏ.ఫ్లైఓవర్ వద్ద నుంచి సికింద్రాబాద్ జలమండలి కార్యాలయం నుంచి గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విశాల్ మదన్ అనే వ్యక్తి జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఉప్పల్‌కు వెళ్లుండగా ఆర్టీసీ బస్సుఢీ కొట్టింది. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

## షాపింగ్‌కు వెళ్తే.. ఖాతాలో డబ్బులు మాయం

**జూబ్లీహిల్స్, జూన్ 4, ప్రభాతవార్తః**

షాపింగ్‌కు వెళ్లిన ఒక డ్రైవర్ ప్రమేయం లేకుండా ఖాతాలో డబ్బులు జమ అవ్వడమే కాకుండా ఎలాంటి ఓటిపి చెప్పకుం డానే అతని ఖాతాలో నుంచి జమ అయిన డబ్బులతోపాటు అతని ఖాతాలోని డబ్బులు మాయమైన సంఘటన పంజా గుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. ఎర్ర మంజిల్ ప్రాంతానికి చెందిన మహ మ్మద్ సాధిక్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. డీమార్ట్‌లోకి షాపిం గ్‌కు వెళ్లిన అతను రూ. 1277 బిల్లును గూగుల్ పే ద్వారా చెల్లించేందుకు సిద్ధమయ్యాడు. అదే సమయంలో అతని ఫోన్ ఆఫ్, ఆన్ కావడంతో యూపిఐ చెల్లింపు చేయలేక డెబిట్ కార్డు ద్వారా డబ్బులు చెల్లించాడు. ఇంటికి వెళ్లిన అనంతరం గమ నించగా అతని ఖాతాలో రూ. 34వేలు జమ అయినట్లు గుర్తించాడు. కొద్ది సయమానికే అతన ఖాతాలో ఎలాంటి అనుమతి లేకుండా రూ. 34వేలతోపాటు అతని ఖాతాలో ఉన్న డబ్బులు రూ. 15వేలు కలుపుతుకొని మొత్తం రూ. 49వేలు డెబిట్ అయ్యాయి. బ్యాంకు వివరాలను పరిశీలించగా మహారాష్ట్ర బ్యాంకుకు చెందిన ఒక ఖాతా నుంచి రూ. 34వే లు వచ్చాయని, అలాగే శుభజిత్ మన్నా పేరుతో యూపిఐ ఖాతాకు రూ. 49వేలు వెళ్లినట్లు గుర్తించాడు. దీనిపై ఆయన 1930 ద్వారా సైబర్ హెల్ప్‌కు ఫోన్ చేసి నమోదు చేసి పంజాగుట్ట ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

**వనస్థలిపురం. జూన్.4.ప్రభాతవార్త.** కట్నం కోసం భర్త వేధిం పులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాహెబ్ నగర్ కలన్, విజయ నగర్ కాలనీలో నివాసముండే ఒట్టిపల్లి బాలకృష్ణ కు స్వాతి తో 2021 లో వివాహం జరిగింది. వీరికి భవ్యశ్రీ(4), నవ్యశ్రీ (2) ఇద్దరు కుమార్తెలు. బాలకృష్ణ ఆటోనగర్ లో వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా బాలకృష్ణ కు మద్యం, ఆన్లైన్ గేమ్స్, బెట్టింగ్ లకు అలవాటు పడి కుటుంబాన్ని పట్టించుకోకుండా ఉండేవాడు. చేడు అలవా ట్లకు బానిసై నిత్యం భార్యను కట్నం తీసుకురమ్మని వేధించే వాడు. భర్త వేధింపులు భరించలేక గురువారం ఉదయం 7 గం టల సమయంలో కుటుంబ సభ్యులు హాల్ లో నిద్రిస్తుండగా, స్వాతి(27) బెడ్ రూమ్ లోకి వెళ్లి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు తండ్రి పిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బండి రమేష్‌కు అభినందనల వెల్లువ...

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 4, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇటీవల కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్ కి అభినందనల వెల్లువ కొనసాగుతోంది. స్పీక్ ( సొసైటీ ఫర్ పొలిటికల్ ఎంపవర్మెంట్ విత్ యాక్షనబుల్ నాలెడ్జ్) సంస్థ ఆధ్వర్యంలో అన్నే సత్యనారాయణ, డాక్టర్ గోపాలం విద్యాసా గర్, అట్లేపల్లి రామప్రభు నేతృత్వంలో గురువారం విశ్వేశ్వర య్య భవన్‌లో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్‌ని వైస్ చైర్మన్ పరుచూరి మురళిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కమ్మ సంఘాల ప్రతినిధులు పాల్గొని అభినందనలు తెలియజేశారు. కార్పొరేషన్ ద్వారా కులంలోని పేదవారికి ప్రభుత్వ పథకాలు అందేలా తగు చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


లారీని ఢీ కొట్టిన బైక్

**షాద్‌నగర్, జూన్ 4, ప్రభాతవార్త :** ఫరూఖ్ నగర్ మండలం పరిధిలో లింగారెడ్డి గూడా వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు షాద్ నగర్ వైపు వెళుతున్న లారీ రిపేర్ కారణంగా రహదారి పక్కన నిలపడంతో షాద్ నగర్ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఆగి ఉన్న లారీని ఢీకొట్టగా ఈ ప్రమాదంలో నంది గామ మండలం అప్పారెడ్డిగూడా గూడా గ్రామ సర్పంచ్ మల్లేష్ కుమారుడు చిన్నంత్ర గారి కార్తీక్ (20) అక్కడికక్కడే మృతి చెందాగా మరో వ్యక్తికి గాయా లయ్యాయి. సమాచారం అందుకున్న షాద్ నగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఉద్యమ ఆకాంక్షలను కూడా గుర్తించాలి

**షాద్‌నగర్, జూన్ 4, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపుపై ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో బీఎస్పీ ప్రతినిధులు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉన్నత స్థాయి కమిటీ చైర్మన్ కే. కేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, బీఎస్పీ, టీజేఎస్ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. బీఎస్పీ తరఫున రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరామకృష్ణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, షాద్ నగర్ సీనియర్ నేత దొడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, 2009 వరకు గ్రామీణ, మండల స్థాయిలో కొనసాగిన తెలంగాణ ఉద్యమం 2011 తర్వాత రాష్ట్రమంతా అగ్గిగా ఒగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బహుజన వర్గాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మాల, మాదిగల డప్పు దరువులు, గొల్ల కురుమల డోలు దెబ్బలు, గౌడల మోకు దెబ్బలు, ఆదివాసీల తుడుం, లంబాడీల నగారా, చాకలి సంఘాల పోరాటాలు కలిసి తెలంగాణ ఉద్యమానికి బలాన్నిచ్చాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సాధన కోసం పోరాడిన విద్యార్థి నాయకులు, న్యాయవాదులు, కవులు, కళాకారులు, మేధావులు, జర్నలిస్టులు, ఉద్యోగ సంఘాల నాయకులను ఉద్యమకారులుగా గుర్తించాలని కమిటీని కోరారు. అలాగే ఆర్టీసీ సమ్మెలు, సింగరేణి కార్మికుల ఉద్యమాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మెలలో పాల్గొన్న వారిని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల కుటుంబాలకు గుర్తింపు కార్డులు అందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ప్రత్యేక రాయితీలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బిఎస్పి తరఫున వినతిపత్రాన్ని కమిటీకి సమర్పించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరామకృష్ణతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న దొడ్డి శ్రీనివాస్

### ఒక వార్డును దత్తత తీసుకుని అభివృద్ధి చేయండి

**షాద్‌నగర్, జూన్ 4, ప్రభాతవార్త :** సినీ నిర్మాత, కాంగ్రెస్ నాయకుడు బండ్ల గణేష్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రకాశ్ రాజ్ గురించి మాట్లాడే అర్హత బండ్ల గణేష్‌కు లేదని రాజా వరప్రసాద్ విమర్శించారు. కాంగ్రెస్‌లో ఉంటూ గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ తిరుపతికి పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తు చేశారు. షాద్‌నగర్ తనదేనని చెప్పుకునే బండ్ల గణేష్, నియోజకవర్గ అభివృద్ధికి ఏమి చేశారని ప్రశ్నించారు. ప్రకాశ్ రాజ్ కనీసం రెండు గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేశారని, అయితే కోట్లాది రూపాయలు సంపాదించిన బండ్ల గణేష్ సమాజానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌పై నిజంగా ప్రేమ ఉంటే ఒక మున్సిపల్ వార్డును దత్తత తీసుకుని అభివృద్ధి చేసి చూపించాలని రాజా వరప్రసాద్ సవాల్ విసిరారు. ప్రజాసేవ, అభివృద్ధి విషయంలో ప్రకాశ్ రాజ్‌ను విమర్శించే ముందు తన సేవలను బండ్ల గణేష్ ప్రజలకు వివరించాలని సూచించారు.


గ్రామసభలో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీ

### ఇంకుడు గుంత.. భవిష్యత్ తరాలకు నీటి భద్రత

**కొత్తూరు, జూన్ 4, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యాచరణలో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో గురువారం వార్డు సభలను నిర్వహించారు. కొత్తూరు మున్సిపల్ కమిషనర్ ఎన్. బాలాజీ ఆధ్వర్యంలో 1వ వార్డు కుమ్మరిగూడతో పాటు 2వ, 3వ వార్డులైన తిమ్మాపూర్ ప్రాంతాల్లో ఈ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎన్. బాలాజీ మాట్లాడుతూ, ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో తమ ఓటును తప్పనిసరిగా మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పరిరక్షించవచ్చని తెలిపారు.

ఇంకుడు గుంతలు లేకపోతే భవిష్యత్ తరాలకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించడం ద్వారా పట్టణ పరిశుభ్రతతో పాటు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు ప్రతి ఒక్కరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభల ప్రత్యేక అధికారి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ అనిత, మండల విద్యాధికారి వెంకట్రామిరెడ్డి, నాయకులు సి. రాజేందర్ గౌడ్, జె. సుదర్శన్ గౌడ్, ఎ. నర్సింహా, కె. సురేందర్, మున్సిపల్ అధికారులు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### సభను విజయవంతం చేయాలి

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 4,(ప్రభాతవార్త):** జడ్చర్లలో నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి భహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి సభకు జిల్లెడు చౌదరిగూడ మండలంలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పెర్కోన్నారు.

# రైతు రిజిస్ట్రీ నమోదు తప్పనిసరి

**మొయినాబాద్, జూన్ 4, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలోని గ్రామసభ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పాల్గొని రైతు రిజిస్ట్రీ మరియు ఫార్మర్ ఐడీ నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, పెట్టుబడి సహాయం తదితర ప్రయోజనాలు పొందేందుకు రైతు రిజిస్ట్రీ నమోదు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఒక గుంట భూమి ఉన్న రైతు కూడా తప్పనిసరిగా రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకొని ఫార్మర్ ఐడీ పొందాలని సూచించారు. గ్రామాల్లో ఇంకా నమోదు చేసుకోని రైతులను గుర్తించి త్వరితగతిన నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ -2026 కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు వాతావరణానికి అనుకూలమైన పంటలను సాగు చేయాలని, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటిస్తూ పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిషన్‌రావు, తహసీల్దార్, ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి అనూరాధ, మండల పంచాయతీ అధికారి, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. అలాగే గ్రామ సర్పంచ్ తలారి లక్ష్మ, ఉప సర్పంచ్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, వార్డు సభ్యులు, రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామసభలో రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.



గ్రామసభలో అవగాహన కల్పించిన అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

# ఎస్సీ బేడ బుడగ జంగం సంఘానికి ఎమ్మెల్యే స్థల విరాళం

**షాద్‌నగర్, జూన్ 4, ప్రభాతవార్త :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎస్సీ బేడ బుడగ జంగం సంఘానికి తన సొంత స్థలాన్ని విరాళంగా అందజేశారు. బుధవారం షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి స్వయంగా హాజరైన ఎమ్మెల్యే, దస్తావేజులపై సంతకాలు చేసి 120 చదరపు గజాల స్థలాన్ని సంఘం పేరున రిజిస్ట్రేషన్ చేయించారు. చేగూర్ రోడ్డులోని విశ్వసాయి వెంచర్‌లో ఉన్న ప్లాటును సంఘానికి అందజేస్తూ ఎమ్మెల్యే తన పెద్ద మనసును చాటుకున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలను ఎస్సీ బేడ బుడగ జంగం సంఘం అధ్యక్షుడు తూర్పాటి వెంకటేష్, ఉపాధ్యక్షుడు సదుల ముత్యాలు తదితరులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో తమకు సహాయం చేస్తానని ఇచ్చిన మాటను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిలబెట్టుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సంఘ అభివృద్ధికి ఆయన అందించిన సహకారం చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ బేడ బుడగ జంగం సంఘం అధ్యక్షుడు తూర్పాటి వెంకటేష్, ఉపాధ్యక్షుడు సదుల ముత్యాలు, కళ్లే ఉషయ్య, సలహాదారులు వానరాసి యాదయ్య, సదుల పెంటయ్య, సదుల నర్సింలు, తూర్పాటి జంగయ్య, సదుల బాలకృష్ణ, సదుల అంజయ్య, నాగుల పెంటయ్య, ప్రధాన కార్యదర్శి సదుల యాదయ్య, సదుల రామస్వామి, కోశాధికారి వానరాసి స్వామి, తూర్పాటి మేగలయ్య, కోఆర్డినేటర్ వానరాసి జగన్, కళ్లేం వెంకటయ్య, సాంస్కృతిక కార్యదర్శి తూర్పాటి దశరథ్, మిరియాల సోమయ్య, తూర్పాటి మల్లేష్, కార్యదర్శులు మొగుటం నర్సింలు, మొగుటం మల్లేష్, కళ్లేం లింగం, సిరివాటి మల్లేష్, తూర్పాటి యాదయ్య, కళ్లేం జగన్ తదితరులు పాల్గొన్నారు.


తన ప్లాటు రిజిస్ట్రేషన్ కాగితాలపై సంతకాలు చేస్తున్న ఎమ్మెల్యే


తన ప్లాటును పత్రాలను బేడ బుడగ జంగం సంఘం సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

# ఘనంగా ముగిసిన సమ్మర్ క్యాంపు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ,జోనల్ కమిషనర్

**రంగారెడ్డి అర్బన్ జూన్4 ,ప్రభాతవార్త :** విద్యార్థులు విద్యతోపాటు క్రీడా రంగాలలో రాణించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శంషాబాద్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ 2026 గురువారం వైభవంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై జోనల్ కమిషనర్ చంద్రకళతో కలిసి విజేతలుగా నిలిచిన క్రీడాకారులను బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.....క్రీడాలు విద్యార్థులకు స్నేహసంబంధాలను పెంపొందిస్తాయని గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు జీహెచ్ఎంసి సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ రైజింగ్ మరియు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా చేపట్టినట్లు తెలిపారు.

### పింఛన్ తీసుకున్న క్షణాల్లోనే నగదు మాయం..

**పింఛన్ డబ్బులపై దుండగుడి కన్ను.. వృద్ధురాలి వద్ద రూ.2 వేల అపహరణ**

**కొత్తూరు, జూన్ 4, ప్రభాతవార్త:** వృద్ధాప్య పింఛన్ తీసుకొని ఇంటికి వెళ్తున్న ఓ వృద్ధురాలి వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తి నగదు లాక్కొని పరారైన ఘటన కొత్తూరులో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మున్సిపల్ అంబేద్కర్ కాలనీకి చెందిన జంగగల లక్ష్మమ్మ (70) బుధవారం కొత్తూరు పోస్టాఫీస్‌లో తన వృద్ధాప్య పింఛన్ రూ. 2,000 నగదును తీసుకున్నారు. అనంతరం ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా పోస్టాఫీస్ సమీపంలోని వీఎన్ఆర్ చికెన్ సెంటర్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి పింఛన్లు ఇస్తున్నారా అని అడిగాడు. దీనికి లక్ష్మమ్మ స్పందిస్తూ తన చేతిలో ఉన్న రూ. 2,000 నగదును చూపించగా, ఆ వ్యక్తి ఒక్క సారిగా ఆమె చేతిలోని డబ్బును బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. జరిగిన విషయాన్ని ఇంటి సభ్యులకు తెలిపిన అనంతరం గురువారం కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి, నగదు అపహరించిన వ్యక్తిని గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టామని ఇన్స్పెక్టర్ నరసయ్య తెలిపారు.

### పౌష్టికాహారంతోనే పిల్లలకు ఆరోగ్యం

**-నందారంలో సర్పంచ్ ఆధ్వర్యంలో బాలామృతం,గుడ్లు పంపిణీ**


చిన్నారులకు,గర్భిణులకు బాలామృతం,గుడ్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్

**దౌల్తాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని నందారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారంరోజు గ్రామసర్పంచ్ స్నేహ రాజగోపాల్ ఆధ్వర్యంలో పిల్లలకు,గర్భిణులకు బాలామృతం,గుడ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల ఆరోగ్య ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో తోడ్పడుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆర్. సునీత, సహాయకురాలు పి. పుష్పమ్మతో పాటు గ్రామస్తులు, తల్లులు, చిన్న పిల్లలు పాల్గొన్నారు.

### శామీర్‌పేట పోలీస్ నూతన ఇన్స్పెక్టర్‌గా కొండా నర్సింహారెడ్డి

**శామీర్‌పేట, జూన్ 4, ప్రభాతవార్త:** శామీర్‌పేట పోలీస్ నూతన ఇన్స్పెక్టర్ (ఎస్‌హెచ్‌ఓ)గా కొండా నర్సింహ్మారెడ్డి బాధ్యతలు చేపట్టారు. గురువారం ఆయన విచ్చేసి శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సిఐగా బాధ్యతలు స్వీకరించారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్‌లోని సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ సిఐగా కొండా నర్సింహ్మారెడ్డి విధులు నిర్వహించి శామీర్‌పేట సిఐగా బదిలీపై వచ్చి చార్జీ తీసుకున్నారు. శామీర్‌పేట పోలీస్ ఇన్స్పెక్టర్‌గా కొనసాగిన శ్రీనాథ్ మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ మల్కాజ్‌గిరికి బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్లిన సిఐ శ్రీనాథ్ పేర్కొంటూ సహకరించిన ప్రతి ఒక్కరికి దన్యవాదాలు తెలియజేశారు. అందరి సహకారంతో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ గత ఏడాదిలో తెలంగాణలోనే నెంబర్ వన్‌గా, దేశంలోనే ఏడవ స్థానంలో శామీర్‌పేట ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపిక కావటం అవార్డులు అందుకోవటం జరిగిందని, మంచి గుర్తింపు లభించిందని సహకరించిన స్టాఫ్‌కు, ప్రజాప్రతినిధులకు, పాత్రికేయులకు ప్రతి ఒక్కరికి బదిలీపై వెళ్తూ సిఐ శ్రీనాథ్ దన్యవాదాలు తెలియజేశారు.




### మూడుచింతలపల్లిలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక

**శామీర్‌పేట, జూన్ 4, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి మున్సిపల్ కేంద్రంలో స్థానిక వార్డులకు సంబంధించి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా వార్డుల ముగింపు సభ జరిగింది. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్ స్థానిక వార్డుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమం వార్డుల ముగింపు సభను నిర్వహించారు. దీనిలో మున్సిపల్ చైర్మన్ జాము రవి, వైస్‌చైర్మన్ ఎం. శశిరేఖ, స్థానిక కౌన్సిలర్ ఆర్. నీరజ్‌గౌడ్, కమిషనర్ వెంకటగోపాల్‌లు పాల్గొన్నారు. వార్డులలో 99రోజులలో చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పలు అంశాలపై చర్చించారు. ప్రగతి ప్రణాళికలను భవిషత్‌లో చేపట్టె పనులపై కూడ చర్చించారు. వార్డులలో ఉన్న సమస్యలను పరిష్కరించటానికి అభివృద్ధి పనులు చేపట్టటానికి కృషి చేస్తున్నట్లు చైర్మన్ జాము రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మేనేజర్ ఉషా, రెవెన్యూ ఆఫీసర్ హర్షద్ అహ్మద్, ఆర్ఐ రాజేశ్వర్‌రెడ్డి, ఎఇ ప్రవీణ, పోలీస్ ఎఎస్ఐ రమేశ్‌గౌడ్, హార్టికల్చర్ ఆఫీసర్ వెంకటరమణ, ఇందిరమ్మ ఇండ్ల ఎఇ కమలాకర్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ మోహన్‌సింగ్, మెప్మా నర్సింలు, వెంకట నర్సింహ్మారెడ్డి, మహిళా సంఘాల వారు, అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ వెంకటగోపాల్,పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ జాము రవి, కౌన్సిలర్ ఆర్.నీరజ్‌గౌడ్, అధికారులు,సిబ్బంది తదితరుల దృశ్యం

# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి

**చేవెళ్ల, జూన్ 4, ప్రభాతవార్త :** గ్రామ అభివృద్ధి పర్యావరణ పరిక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఊరెళ్ల, మొండివాగు, దేవుని ఎర్రవల్లి వార్డుల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజ్ఞా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధిలో సహకరించాలన్నారు. అంతకు ముందు చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ సమతావెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో జల సరంక్షణ మన సంరక్షణ, మొక్కల పెంపకం ద్వారా వన మహోత్సవం విజయవంతం చేయాలన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ప్రజల భద్రత వంటి అంశాలపై చర్చిండం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ ప్రత్యేకాధికారిణి జె. పద్మవతి, చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ యాదగిరి, కౌన్సిలర్లు దుత మల్లేష్, మీనాక్షి , సువర్ణ, మాజీ ఎంపిటీసీ చంద్రయ్య, మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డి, వార్డు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ఆశాఖల అధికారులు తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సరిత

### భూమి సర్వే ప్రక్రియపై అవగాహన సదస్సు

**షాద్‌నగర్, జూన్ 4, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి భూమి సర్వే కార్యక్రమంలో భాగంగా ఫరూఖ్‌నగర్ మండలంలోని వెల్జర్ల గ్రామ రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. వెల్జర్ల, సూర్యారావుగూడ తదితర గ్రామాల రైతులకు భూముల సర్వే, హద్దు బందులు, భూ రికార్డుల నిర్వహణపై అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్డీవో, ఫరూఖ్‌నగర్ తహసీల్దార్, జిల్లా వ్యవసాయ శాఖ ఏడీ, ఏఈ, జిల్లా సర్వేయర్లు, మండల సర్వేయర్లు పాల్గొని రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. భూమి సర్వే ప్రక్రియలో రైతులు అనుసరించాల్సిన విధానాలను సులభంగా అర్థమయ్యేలా వివరించారు. వెల్జర్ల సర్పంచ్ ఆర్. బాబు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామానికి సంబంధించిన భూముల సర్వే అంశాలపై సర్పంచ్ అధికారులను ప్రశ్నించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, కొండన్నగూడ సర్పంచ్ సురేష్, ఎల్లామోని శ్రీను, వెంకన్నగూడ సర్పంచ్ ఆనంద్, డిప్యూటీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, వెల్జర్ల డిప్యూటీ సర్పంచ్ డాక్టర్ దొడ్డల వెంకటేష్, వార్డు సభ్యులు దొడ్డి లక్ష్మ రవీందర్, పి. వెంకటయ్య, మాజీ డిప్యూటీ సర్పంచ్ టి. రమేష్, కావలి లక్ష్మయ్య, వి. ప్రవళి మహేష్, దొడ్డి రాందాస్, అనిమి పెద్ద శివరాజ్ గౌడ్, బీజేపీ నాయకుడు యాదయ్యతో పాటు రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ధర్తీ మాతా బచావో

**తలకొండపల్లి, జూన్ 4,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం రోజున గ్రామ సభను సర్పంచ్ బుజూరి పుష్పమ్మ అంజన్ రెడ్డిఆధ్వర్యంలో గ్రామకార్యదర్శి అలివేలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్‌గా రేణుక చక్రవర్తి హాజరై గ్రామ ములో రాబోయే వర్షాకాలాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ ప్రోగ్రాంలో భాగంగా ప్రతి ఒక్కరూ నాలుగు రకాల డస్ట్బిన్ లను ఏర్పాటు చేసుకొని తడి , పొడి , శానిటరీ, హానికర చెత్త అని నాలుగు రకాలుగా ఇంటి దగ్గరే వేరు చేయాలని, వర్షాకాలానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు / సూచనలు, పరిశుభ్రత, బడిబాట కార్యక్రమం, మరియు వన మహోత్సవం పై చర్చించడం జరిగింది. ఎంఏఓ రేణుక చక్రవర్తి మాట్లాడుతూ ధర్తీమాత బచావో ప్రోగ్రాంలో భాగంగా రైతులు భూసార పరీక్షలు చేయించుకుని ఎరువుల వాడకం తగ్గించాలని, ఆర్గానిక్ (జీవ) ఎరువుల వాడకం పెంచాలని, మరియు ప్రతి రైతు రైతుగుర్తింపు కార్డును చేయించుకోవాలని వీటి ద్వారా మాత్రమే రైతులకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తాయని, ఎల్ నినో ప్రభావం చేత ఈసారి తక్కువ వర్షపాతం నమోదు కావచ్చనే వాతావరణ సూచనలు ఉన్నందున తక్కువ నీటితో పండించే పంటలు , నీటి వనరులను చూసుకుని సాగు చేయాలని తెలపడం జరిగింది. మహిళా సంఘం సిసి శ్రీశైలం మాట్లాడుతూ గ్రామంలో మహిళా సంఘాలతో పాటు వృద్ధ, వికలాంగుల, కిషోర బాలికల సంఘాలు కూడా ఏర్పాటు చేసుకోవాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పరిపాలన అధికారి రమేష్ యాదవ్ డిప్యూటీ సర్పంచ్ సొప్పరి చంద్రశేఖర్, వార్డు సభ్యులు మొగిలి శెట్టి మహేష్, గొర్రె మల్లేష్, గ్రామ పెద్దలు ఆంజనేయులు గౌడ్, ఆయిల్ వెంకటయ్య గౌడ్ మరియు గ్రామ యువకులు మహిళలు పాల్గొనడం జరిగింది.

### చింతకుంటపల్లిలో గ్రామ సభ

**కేశంపేట, జూన్ 4, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్ అధ్యక్షతన గురువారం గ్రామ సభ నిర్వహించారు , ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అజీజ్ హాజరై తడి పొడి చెత్త, వాన నీటి సంరక్షణ, ఉపాధి హామీ పనులు, మొక్కలు మరియు వ్యసాయ శాఖ కు సంబందించిన వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు, ప్రభుత్వ దవాఖానా సూపర్ వైజర్ శివానంద్ పాల్గొని గ్రామ ప్రజలకు వైద్యం, మరియు పరిసరాల శుభ్రత, వ్యాక్సిన్‌లు మరియు వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ, ప్రత్యేక అధికారి అజీజ్, సూపర్వైజర్ శివానంద్, జీపీవో విజయలక్ష్మి, ఉపసర్పంచ్ సంధ్య, సెక్రటరీ మురళి, వార్డ్ సభ్యులు బైకని మల్లేష్ యాదవ్,గుండెల్ల జంగయ్య, దోల శంకర్, మరియు ఉపాధ్యాయులు సుచరిత, శాహీన్, ఆశ వర్కర్ జ్యోతి, వివో పద్మ మరియు గ్రామ మహిళలు, యువత, తదితరులు పాల్గొన్నారు.

### గ్రామసభలో అధికారుల ముఖాముఖి

**కొత్తూరు, జూన్ 4, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ అరుంధతి, సీఐ నర్సయ్య, ఏఈ జగత్ చంద్ర పాల్గొని గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అరుంధతి మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. గ్రామసభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమీక్షి ంచి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మని అధికారులు హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గౌస్, ఉప సర్పంచ్ శంతన్ రెడ్డి, వార్డు సభ్యులు వేదాంత చారి, మాధవి, మంద మాధవి, ఆర్బాస్, భారతమ్మ, మైబూజీ, శారద, రమాదేవి, వ్యవసాయ అధికారి సమీనా, ఏఈ మోహన్, ఏఎన్ఎం సూపర్వైజర్ రేవతి, గ్రామ పెద్దలు మల్లారెడ్డి, సహదేవ్, దామోదర్, మామిడి అర్జున్ రెడ్డి, దేశాల భీమయ్య, మామిడి ప్రవీణ్ రెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### శామీర్‌పేట మండల నూతన తహసీల్దార్‌గా సిహెచ్ శ్రీనివాస్ బాధ్యతలు

**శామీర్‌పేట, జూన్ 4, ప్రభాతవార్త:** శామీర్‌పేట మండల నూతన తహసీల్దార్‌గా సిహెచ్ శ్రీనివాస్ నియమితులై బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఆయన శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల శామీర్‌పేట మండల తహసీల్దార్ సుచరిత నాలా కన్వర్షన్ కోసం 30లక్షల రూపాయలు డిమాండ్ చేసి బాధితులు 2లక్షల రూపాయలు ఆమె డ్రైవర్ ద్వారా లంచం తహసీల్దార్‌కు అందజేయగా ఎసిబి అధికారులు పట్టుబడిన సంగతి తెలిసిందే. దీనిలో ఆమె ఈ కేసులో అరెస్ట్ అయి రిమాండ్‌కు వెళ్లటం జరిగింది. ఇక శామీర్‌పేట మండల డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జున్ ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేశారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జున్ నుంచి శామీర్‌పేట మండల నూతన తహసీల్దార్‌గా సిహెచ్ శ్రీనివాస్ చార్జి తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర మైన్స్ డవలప్‌మెంట్ కార్పోరేషన్‌లో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించి మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు శామీర్‌పేట మండల తహసీల్దార్‌గా సిహెచ్ శ్రీనివాస్ బదిలీపై వచ్చి చార్జి తీసుకున్నారు. ఈ సందర్భంగా మండల నూతన తహసీల్దార్ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రభుత్వ నిబంధనల మేరకు పనిచేస్తానని అన్నారు. మండల కార్యాలయంలో రెవెన్యూ పనులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికపుడు పూర్తి చేస్తానని అన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండ చూస్తానని ఆయన అన్నారు.


శామీర్‌పేట మండల నూతన తహసీల్దార్‌గా సిహెచ్ శ్రీనివాస్ నియమితులై బాధ్యతలు స్వీకరించిన దృశ్యం

# రైతుల ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

**..మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసిన ..తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ముఖ్య నాయకుల బృందం..కొనుగోలు చేసిన ధాన్యంను తరలించటానికి లారీలను ఏర్పాటు చేయాలి**

**శామీర్‌పేట (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జూన్ 4, ప్రభాతవార్త:** శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం కొనుగోలు నిలిచిపోయిందని, కొనుగోలు చేసిన ధాన్యంను తరలించటంలో లారీల కొరత ఉండి కేంద్రాల్లో స్థలంలేక కొనుగోలు ఆపారని రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే సమస్య పరిష్కారానికి అధికారులు తగు చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ముఖ్య నాయకుల బృందం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందం రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ముఖ్య నాయకుల బృందం చేరుకుని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అదే విధంగా జిల్లా సివిల్‌సప్లయి డిఎం సుగుణబాయిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. శామీర్‌పేటలో వరిధాన్యం బస్తాలతో రాజీవ్‌రహదారిన రైతులు రాస్తారోకో చేసిన సంగతి తెలిసిందే. దీనిపై రైతు సంఘం నాయకులు జిల్లా అదనపు కలెక్టర్‌ను, డిఎంను కలిసి సమస్యలను వివరించారు. దీనికి వారు స్పందించారని బొమ్మరాస పేటలో గోదామును పరిశీలిస్తున్నామని, లారీలను కూడ ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. శామీర్‌పేట సొసైటీ పరిధిలో శామీర్‌పేట, మూడు చింతలపల్లి మండలాల్లో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు శామీర్‌పేట, అలియాబాద్, జగ్గంగూడ, కేశవరం, మూడుచింతలపల్లి-లక్ష్మాపూర్, అదే విధంగా ఉద్దెమర్రిలోనూ వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేక నిలిచిపోయినట్లు, దీనిలో అధికారుల ముందస్తు చర్యలు లేక నిర్లక్ష్యం వల్లనే రైతులు వరిధాన్యంను అమ్ముకోలేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మరో వైపు వర్షాలు వస్తున్నట్లు దాన్యం తడిసిపోయే పరిస్థితి దాపురించిందన్నారు. దీంతో రైతాంగం వరిధాన్యం కొనుగోలు లేక పడిగాపులు పడాల్సి వస్తుందన్నారు. అయితే బుధవారం సాయంత్రం, గురువారం ఉదయం ఇప్పటి వరకు రెండు లారీలు మాత్రమే వచ్చినట్లు కొనుగోలు చేసిన వరిధాన్యంను కొంత వరకు తరలించారని, వాటి స్థానంలో కొందరివి వరిధాన్యంను కొనుగోలు చేశారని, మళ్లీ స్థలం లేక లారీలు లేక మళ్లీ నిలిచిపోయినట్లు వెంటనే లారీలను ఏర్పాటు చేసి వరిధాన్యంను కొనుగోలు కొనసాగించాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్‌ను, డిఎంను కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి డిజి నరేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షులు డి.జంగయ్య, కార్యదర్శి నిమ్మల నర్సింహ్మా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ, పి.నరసింహ, పి.సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు ఎం.శ్రీకాంత్‌రెడ్డి, పలువురు రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ముఖ్య నాయకుల బృందం దృశ్యం

## గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**దోమ, జూన్ 4, ప్రభాతవార్త :** గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయుటకు గ్రామ ప్రజల సహకారం ఎంతో అవసరమని దోమ సర్పంచ్ మాలి శివకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం నాడు దోమ మండల కేంద్రములోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భముగ ఆయన గ్రామములోని అన్ని వార్డులలో సిమెంట్ రోడ్లు నిర్మాణంనకు, అండర్ డ్రైనేజి, వీదిదీపాలు, పరిసరాల పరిశుభ్రతకు ప్రతిపాదనలు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామములో ఉన్న సమస్యలను వార్డు సభ్యులకు తెలియజేస్తె సమస్యలు పరిష్కరించవచ్చుని అన్నారు. దోమ ఎస్ఐ వసంత్‌జాదవ్ మాట్లాడుతూ ప్రజల సైబర్ నేరగాళ్ళపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని ఫోన్‌కాల్ చేసి లోన్లు ఇస్తామని మాయ మాటలు చెప్పి బ్యాంకు అకౌంట్‌లోని డబ్బులు కొట్టెస్తారని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సంబందిత అదికారులను పోలీసులను100 డైల్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమములో తహసిల్దార్ గోవిందమ్మ, డాక్టర్ రజిత, ఏపిఎం శోభ, ఏఇఓ శ్రవన్, పిఏసిఎస్ డైరెక్టర్ జాకటి వెంకటయ్య, వార్డుసభ్యులు వెంకటయ్య, మాజి సభ్యులు వసంత్‌రావు , ఆశవర్కర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జాకారం నారాయణ , లక్ష్మన్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## సిల్వర్ జూబ్లీ వేడుకల కన్నా
## ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే గొప్ప

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 4, ప్రభాత వార్త:** పదవ తరగతి పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకల కంటే ఆపదలో ఉన్న తోటి స్నేహితులను ఆదుకోవడమే గొప్పయని మాజీ వార్డు సభ్యుడు, పోచారం డివిజన్ కాంగ్రెస్ నాయకుడు పసులాది నర్సింగ్‌రావు ముదిరాజ్ అన్నారు. పోచారం డివిజన్ చౌదరిగూడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు పసులాది నర్సింగ్‌రావు 1997 పదవ తరగతిని కొర్రెముల జడ్పీ హైస్కూల్‌లో చదువుకున్నాడు. ఇటీవల పదవ తరగతి బ్యాచ్‌మెంటు పూర్వ విద్యార్థురాలు అయిన జయంతి భర్త అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న నర్సింగ్‌రావు మిగతా పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులకు తెలిపి అందరు కలిసి తలో ఓచేయి వేసి 50 వేల రూపాయల నగదును సమకూర్చి చౌదరిగూడలోని బాధితురాలుకు అంద జేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో వేడుకలు జరిపినా లేని తృప్తి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఉన్నదని అన్నారు. కష్టకాలంలో తమ పదవ తరగతి బ్యాచ్‌మెంటును ఆదుకోవడంలో ముందుకు వచ్చిన మిగతా పూర్వ విద్యార్థులు తోటి స్నేహితులను నర్సింగ్‌రావు అభి నందనలు తెలిపారు.

## అల్కాలాంబపై తప్పుడు కేసులు తక్షణమే ఎత్తివేయాలి

**చేవెళ్ల, జూన్ 1, ప్రభాతవార్త :** గత పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహిళా రిజర్వేషన్ కోసం ఉద్యమం చేసిన జాతీయ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు అల్కా లాంబపై కేంద్ర బిజెపి ప్రభుత్వం బనాయించిన తప్పుడు కేసులను తక్షణమే ఉపసంహరించుకుని, ఆమెను బేషరతుగా విడుదల చేయాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతిభీమ్ భరత్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జాతీయ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వేదికగా మాట్లాడిన జ్యోతి భీమ్ భరత్, మహిళా రిజర్వేషన్ ఉద్యమ సందర్భంగా బిజెపి ద్వంద రాజకీయనీతిని దేశ రాజధానిలో ఎండగట్టినందుకే అల్కా లాంబపై కక్షపూరితంగా తప్పుడు కేసులు పెట్టారని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ ఉద్యమంలో తమ కుటిల నీతిని ఎండగట్టినందుకు తప్పుడు కేసులు పెట్టడం దారుణమని, వెంటనే వాటిని వెనక్కి తీసుకోకపోతే తెలంగాణతో పాటు యావత్ భారత దేశ వ్యాప్తంగా మహిళా సాధికారత ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జాతీయ మహిళా కాంగ్రెస్ నాయకురాలు అల్కా లాంబకి మద్దతుగా నేడు తెలంగాణ నుంచి అనేకమంది మహిళా ప్రతినిధులు ఢిల్లీలోని జాతీయ కాంగ్రెస్ కార్యాలయం వద్దకు చేరి తమ సంఘీభావాన్ని తెలిపారని ఆమె వెల్లడించారు. మహిళల హక్కుల కోసం పోరాడుతున్న నాయకులపై అక్రమ కేసులు బనాయించడం ప్రజాస్వామ్య విరుద్ధమని, కేంద్రం తన నిరంకుశ వైఖరిని మానుకోవాలని జ్యోతి భీమ్ భరత్ స్పష్టం చేశారు.

## ఎదిరలో హైమాక్స్ లైట్ల ప్రారంభం

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 4,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఎదిర గ్రామంలో బుదవారం రాత్రి హైమాక్స్ లైట్లను ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్ల వల్లన కాలనీలు వెలుగులతో నిండిపోయయాని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, అభిమానులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సమావేశంలో పాల్గొన్న దళిత నాయకులు

**తలకొండపల్లి, జూన్ 4, ప్రభాతవార్త:**

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దళిత నాయకులతో గత రెండు రోజులుగా హైదరాబాదులో శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తలకొండపల్లి మండలం నుంచి మాజీ ఎంపీపీ లక్ష్మీ మ్రదేవి రఘురాములు, సివిఎంసి కమిటీ చైర్మన్ డేవిడ్, జర్నలిస్ట్ సంఘం నాయకులు దరువుల శంకర్, అడ్వకేట్ సంఘాల నుంచి రమ్య, లు హాజరైనారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాష్ట్రస్థాయిలో హైదరాబాదులోని రామంతపూర్ లో గల ఎంజాయ్ మీటింగ్ హాల్లో నిర్వహించిన ఈ సమావేశంలో దళిత రాష్ట్ర నాయకులు నందగోపాలు, చిట్టిబాబులు హాజరై పలు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇరువు రాష్ట్రాలలోని వందమంది దళిత సంఘాల, ప్రజా సంఘాల నాయకులకు శిక్షణ నిర్వహించి పలు చట్టాలపై సూచనలను సలహాలు చేశారు. అనంతరం ఆయన సంఘాల నాయకులను ఘనంగా సన్మానించారు. నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి బి ఎస్ యు జిల్లా కార్యదర్శి జోగు రమేష్, మాజీ ఎంపీపీ లక్ష్మీ మ్రదేవి రఘురాములు, సి బి ఎం సి కమిటీ చైర్మన్ డేవిడ్, జర్నలిస్ట్ నాయకులు దరువుల శంకర్, సామాజిక కార్యకర్త లు కుమార్, చంద్రకళ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి గ్రామంలో శాస్త్రీయ పద్దతిలో
## వ్యర్థాల నిర్వహణ చేపట్టాలి

**చేవెళ్ల, జూన్ 4, ప్రభాతవార్త :** సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి గ్రామంలో శాస్త్రీయ పద్దతిలో వ్యర్థాల నిర్వహణ చేపట్టి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని చేవెళ్ల తహసీల్దార్ బి. కృష్ణయ్య తెలిపారు. స్వచ్ఛ గ్రామీణ్ 2.0 కార్యక్రమం లో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణపై చేవెళ్ల మండలంలోని అంతారం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలందరు తడిపొడి చెత్త వ్యర్థాల వేరుచేయడం ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ చేయాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయారదాన్నరు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉం చుకోవాలని సూచించారు. గ్రామాల్లో చెట్లు బాగా పెంచి పర్యావరణ పరిరక్షణకు ప్రతి క్కకు సహకరించాలన్నారు. చెత్త రహిత స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ఏక గ్రీవంగా తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామస్వామి, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల తహసీల్దార్ బి. కృష్ణయ్య

# ఎఫ్ఎస్ఎస్ యాప్ ద్వారానే ఎరువుల కొనుగోలు



.అలియాబాద్ రైతువేదికలో ఎఫ్ఎస్ఎస్ యాప్‌పై డీలర్లకు,రైతులకు, అధికారులకు జరిగిన శిక్షణా కార్యక్రమం,పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, సంబంధిత అధికారుల దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 4, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఎఫ్ఎస్ఎస్ యాప్ ద్వారా అన్ని రకాల ఎరువులను రైతులు కొనుగోలు చేయాలని, ఈ యాప్‌పై రైతులు, డీలర్లు, వ్యవసాయ అధికారులు పూర్తి అవగాహన కల్గి ఉండాలని మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ సూచించారు. గురువారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ రైతువేదికలో రైతులకు, డీలర్లకు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు యాప్‌పై శిక్షణా కార్యక్రమం జరిగింది. సంబంధిత అధికారులు ఈ శిక్షణలో యాప్‌పై అవాహన కల్పించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో, రంగారెడ్డి జిల్లాలోనూ అమలు అవుతుందని అన్నారు.

రైతులు అందరు ఈ కొత్త యాప్ ద్వారా అన్ని రకాల ఎరువులను కొనుగోలు చేయాలని ఆమె సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో శామీర్‌పేట మండల వ్యవసాయ అధికారి సిహెచ్ రమేశ్, దుండిగల్ వ్యవసాయ అధికారి యాదగిరి, బాలానగర్ వ్యవసాయ అదికారి సాయి రమేశ్, ఉప్పల్ వ్యవసాయ అధికారి కృపాకర్‌రెడ్డి, వ్యవసాయ విస్తర్ణ అధికారులు సుదీర్‌కుమార్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

**షాద్‌నగర్, జూన్ 4, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు కీర్తి వెంచర్‌లో జరుగుతున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీవాసులకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే మున్సిపాలిటీ లక్ష ్యమని తెలిపారు. కీర్తి వెంచర్‌లో అండర్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తయితే పారిశుధ్య సమస్యలు తగ్గడంతో పాటు స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ బచ్చలి నరేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, చందూలాల్, సాయి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

# సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, జూన్ 4, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో అభయ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల" కార్యక్రమంలో భాగంగా వార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వార్డులో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా పాలన ద్వారా ప్రజల అభిప్రాయాలు, అవసరాలు తెలుసుకొని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సహకారంతో వార్డు అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, 7వ వార్డు కౌన్సిలర్ కొప్పునూరి ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, కౌన్సిలర్లు మురళీమోహన్, అప్పి, దిలీప్, బచ్చలి నరేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, శ్రీశైలం గౌడ్, ముబారక్ అలీ ఖాన్, సాదిక్, చందూలాల్, జయప్రకాశ్, మనీష్, అర్జున్, లక్ష ్మణ్, మంచిరేవుల అశోక్, రాజు గౌడ్, మంగ అశోక్, కాలనీవాసులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దొంగల బీభత్సం

**తలకొండపల్లి జూన్4, ప్రభాత వార్త:**

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో 400 వందలకు పైగా సంవత్సరాల చరిత్ర కలిగి రాంపూర్ గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ ్మ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. ప్రశాంతంగా ఉండే ఆలయంలో దొంగతనాలు చేస్తూ భక్తులను బెంబేలెత్తిస్తున్నారు. అర్థరాత్రి సమయంలో ఆలయానికి చేరుకున్న గుర్తు తెలియని దుండగులు, దేవాలయ ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. గర్భగుడి ఎదురుగా ఉన్న హుండీ తాళం ధ్వంసం చేశారు. ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు, తలుపులు విరగ్గొట్టి ఉండటం చూసి స్థానికులకు, సమాచారం అందించారు .





రాంపూర్‌లో చోరీ జరిగిన దేవాలయం

### జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభకు
## కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలి
### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనుమగల్ల రమేష్

**కేశంపేట, జూన్ 4, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి లక్ష ్యంగా అహర్నిశలు కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జడ్చర్లలో నిర్వహించ నున్న మహా బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ పిలుపునిచ్చారు. నేడు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గంగాపురం లోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్దకు కేశంపేట్ మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరుకోవాలని రమేష్ పిలుపునిచ్చారు .షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సభలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విజయాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. జడ్చర్ల-కల్వకుర్తి రోడ్డులోని భారీ బహిరంగ సభ ప్రాంగణంలో సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ముఖ్య నాయకులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వానికి మద్దతుగా నిర్వహిస్తున్న ఈ విజయగర్జన సభకు అన్ని గ్రామం నుంచి జనసంద్రంలా తరలివచ్చి చరిత్రాత్మక విజయాన్ని సాధించాలని ఆయన మండల కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు.



బిటి రోడ్డు పనులను పరిశీలిస్తున్న జాండగూడెం సుదర్శన్ గౌడ్, ఇతర నేతలు

## కొత్తూరులో మౌలిక వసతుల విస్తరణ

**కొత్తూరు, జూన్ 4, ప్రభాతవార్త:**

కొత్తూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్ తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో కొత్తూరు కుమ్మరిగూడ బిటి రోడ్డు పనులు మళ్లీ ప్రారంభమయ్యాయని చెప్పారు. గురువారం ప్రారంభమైన రోడ్డు పనులను సుదర్శన్ గౌడ్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బిటి రోడ్లు, సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు వంటి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో కొత్తూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోల సురేందర్, మాజీ వార్డు సభ్యుడు గోవిందు నాయక్, నరసింహ, హసేన్ తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు నగదు బహుమతులు

**ధారూర్, జూన్ 4, ప్రభాత వార్త:** ధారూర్ మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని గురువారం గ్రామంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. ఏఐసీసీ యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కోలుకుంద సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు, అధికారులకు ప్రత్యేక బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పొసైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులను అందజేశారు. ఇందులో భాగంగా ప్రథమ స్థానంలో నిలిచిన వారికి మూడు వేల రూపాయలు, ద్వితీయ స్థాయిలో నిలిచిన వారికి 2500 రూపాయలు, అలాగే ఉత్తీర్ణత సాధించిన మిగతా విద్యార్థులందరికీ వెయ్యి రూపాయల చొప్పున నగదును అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారుల సేవలను కొనియాడుతూ వారిని ఘనంగా సన్మానించారు. అలాగే వారికి వాటర్ బాటిళ్లను బహుమతిగా అందజేశారు. విద్యార్థులు చదువులో మరింత రాణించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజి, మైనార్టీ అధ్యక్షుడు గాఫర్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంకోసమే ప్రజా పాలన
### సర్పంచ్ కొనింటి సుజాతమల్లేష్

**పూడూరు, జూన్ 4, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారంకోసమే రాష్ట్రప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని చేపట్టిందని సర్పంచ్ కొనింటి సుజాతమల్లేష్ పేర్కొన్నారు. 99రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం పూడూరు మండలం పరిధిలోని మీర్జాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను తెలిపారు. త్వరలో గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసు కుంటామన్నారు. మధ్యపానం నియంత్రణకోసం గ్రామసభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తహశీల్దారు విజయ్‌కుమార్ మాట్లాడుతూ పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి నిర్వహించిన అభివృద్ధిని ప్రజల ముందు ఉంచేందకే గ్రామసభను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. మధ్యపానం నిషేదం, ధరల నియంత్రణకోసం గ్రామ సభలో తీర్మాణాలు చేయాలని సూచించారు. చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేసుల నియంత్రణకోసం నిఘానేత్రంలో భాగంగా గ్రామాల్లో తప్పకుండా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డుభద్రతపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వివరించారు. వాహనాలు నడిపేవారు హెల్మెట్, సీటు బెల్టులు తప్పకుండా దరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపడం చట్టవిరుద్ధమని, వారికి వాహనాలు ఇచ్చిన వారిపైకూడా కఠిన చర్యలు ఉంటాయన్నారు. అదేవిధంగా పూడూరు, రేగడి మామిడిపల్లి తదితర గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు, పూడూరు సర్పంచ్ ఖిజర్‌పాష, రేగడి మామిడిపల్లి సర్పంచ్ భూపతిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఎరువుల విక్రయాలు అందించడమే లక్ష్యం
### మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర.

**షాబాద్, జూన్ 4, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం వానాకాలం సీజన్ నుంచి ప్రవేశపెట్టిన "ఫెర్టిలైజర్ యాప్" రైతులకు ఎరువుల విక్రయాలను మరింత పారదర్శకంగా, సులభతరంగా అందించేందుకు దోహదపడుతుందని షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర తెలిపారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ఫెర్టిలైజర్ యాప్ ప్రారంభోత్సవం మరియు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ యాప్‌ను రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎరువుల డీలర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) పాల్గొని యాప్ పనితీరుపై అవగాహన పొందారని చెప్పారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో యాప్ ద్వారా నమోదు, విక్రయాల పర్యవేక్షణ, నిల్వల సమాచారం తదితర అంశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. షాబాద్ మండల పరిధిలోని ఎరువుల డీలర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు శిక్షణా కార్యక్రమానికి హాజరై యాప్ వినియోగంపై అవగాహన పెంపొందించుకున్నారు. అనంతరం రైతులకు ఈ కొత్త ఫెర్టిలైజర్ కొనుగోలు విధానాన్ని వివరించేందుకు అవసరమైన సూచనలు అందించారు.

## మోకిలలో గ్రామసభ

**శంకర్‌పల్లి, జూన్ 4, ప్రభాతవార్త :** శంకరపల్లి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ 99 రోజుల ప్రణాళికలో భాగంగా మోకిలా గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన గ్రామసభ సమావేశానికి ప్రత్యేక అధికారిగా హాజరైనాను అక్కడ ఎస్ ఐ ఆర్ పై అనగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనే అంశం మరియు వరద నిర్వహణ భద్రత అనే అంశం సురక్షి త త్రాగునీరు ఘన వ్యర్థాల నిర్వహణ జల సంరక్షణ మన సంరక్షణ మొక్కల పెంపకం వన మహోత్సవం మొదలగు అంశాల గురించి సంబంధిత శాఖల వారీగా అధికారులతో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం అయినది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్లంపల్లి శేఖర్ ఉప సర్పంచ్ మాధవి అలాగే వ్యవసాయ అధికారి చైతన్య సీఏ శ్రీనివాస్ రెడ్డి ఎస్సై కార్యదర్శుల నరసింహ మరియు గౌరవ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

**రంగారెడ్డి అర్బన్ జూన్4 ,ప్రభాతవార్త :**

శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలోని పలు రికార్డులు, పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. గత కొంతకాలంగా కార్యాలయ నిర్వహణపై పలు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. తనిఖీల సందర్భంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ, రికార్డుల నిర్వహణ, ఇతర పరిపాలనా అంశాలను పరిశీలించారు.